

మార్కెట్ యార్డులకు చేరుతున్న మామిడి కాయలు



చిత్తూరు మార్కెట్ యార్డుకు చేరిన బేనీషా రకం మామిడి కాయలు

చిత్తూరు సెంట్రల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి కోతలు మొదలవడంతో మార్కెట్ యార్డులకు కాయలను భారీగా తరలిస్తున్నారు. జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం మ్యాంగో మార్కెట్ యార్డులు ఉన్నాయి. రెండ్రోజుల నుంచి చిత్తూరు యార్డుకు మామిడి కాయలు చేరుతున్నాయి. ప్రస్తుతం బేనీషా, పుల్లూరా, ఖాదర్ వంటి రకాలు వస్తుండగా, త్వరలో తోతాపురి రకం రానున్నాయి. రోజువారీగా 150 టన్నుల కాయలు యార్డుకు చేరడంతో ఆ శాఖ అధికారులు సైతం రైతులకు ప్రయోజనం చేకూర్చే దిశగా చర్యలు చేపడుతున్నారు. బేనీషా టన్ను ధర రూ.20-30వేల వరకు పలుకుతుండగా, దీన్ని రూ.35 వేలకు పెంచడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు చొరవ చూపుతున్నారు. పుల్లూరా టన్ను కేవలం రూ.9వేలు పలుకుతుండగా, రూ.15వేలు చేయనున్నారు. ఖాదర్ టన్ను ధర రూ.29 వేలు ఉండగా, రూ.32వేలు చేయనున్నారు. వచ్చేవారంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మామిడి కాయలు రానున్నాయి. వచ్చే వారంలో రోజుకు 400 మెట్రిక్ టన్నులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కోతలు పెరడంతో గుజ్జు తయారీ కోసం మామిడి రైతులు పొలాల నుంచి నేరుగా ఫ్యాక్టరీలకు కూడా కాయలను తరలిస్తున్నారు.



రైతుల ప్రయోజనాలే ముఖ్యం

రైతుల ప్రయోజనాలే ముఖ్యంగా చర్యలు తీసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్‌లో కన్నా మార్కెట్ యార్డులకు చేరే మామిడి కాయల టన్నుకు కనీసం రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. రైతులు సైతం కాయలను యార్డులకు తరలించి, లాభాలు పొందాలి.

- పరమేశ్వరన్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

జడ్పీ మాజీ సీఈవో సీసీకి షోకాజ్ నోటీసు

చిత్తూరు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి):జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర రెడ్డి సీసీ, ప్రస్తుతం జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేంద్రరెడ్డికి జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన సురేంద్రరెడ్డి పై చర్యలు తీసుకోవాలని వారం రోజుల క్రితం విశ్రాంత ఎంపీడీవో కనకరాజులు నాయుడు ప్రభుత్వానికి, పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభాకర రెడ్డికి సీసీగా ఉన్న సమయంలో 48మంది ఉద్యోగుల ఎస్ఆర్‌లు సురేంద్ర రెడ్డి దాచి ఇబ్బంది పెట్టాడని, జడ్పీ కార్యాలయంలోని అన్ని సెక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అనధికారికంగా మానిటర్ చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే టైప్ రైటింగ్ పాస్ కాకుండానే ప్రమోషన్లు పొందాడని, జడ్పీకి సంబంధించిన ఫైళ్లు దాచిపెట్టి సిబ్బందిని ఇబ్బందులకు గురిచేశాడని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఈ ఫిర్యాదుపై వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని సురేంద్ర రెడ్డికి నోటీసు జారీ చేశారు.

రాయితీ రుణం! ఎంతెంతెంత దూరం??

- తాత్కాలికంగా ఆగిన మంజూరు ప్రక్రియ
- యూనిట్ల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నాలు

చిత్తూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాల మంజూరుపై అనిశ్చితి నెలకొంది. లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను యథాస్థితిలో ఉంచాలని ప్రభుత్వం మౌఖికంగా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. యూనిట్లకు మించి దరఖాస్తులు అందడంతో అర్హులైన వారికి రుణాలను మంజూరు చేసే అవకాశం లేదు. ఆశావహుల జాబితాను ప్రభుత్వానికి పంపి.. మరిన్ని యూనిట్లను మంజూరు చేయించే పనిలో అధికారులున్నారు. దీంతో బీసీ కార్పొరేషన్ అధికారులు ఎక్కడి పను లక్కడే ఆపేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు అందాక రుణాల మంజూరు ప్రక్రియ మొదలు కానుంది.వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులు అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన రుణాలను రికవరీ చేసి జీతాలు తీసుకుంటూ గడిపేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. కొన్నేళ్లుగా సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూసిన లబ్ధిదారులు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. **చిత్తూరు జిల్లాలో** బీసీ కార్పొరేషన్ ద్వారా 2,939 యూనిట్లను మంజూరు చేస్తే 21,504దరఖాస్తులందాయి. ఇందులో బ్రాహ్మణ కార్పొరేషన్‌లో 19 యూనిట్లకు 44, ఈబీసీ వర్గాలకు 103 యూనిట్లకు 384, కమ్మ కార్పొరేషన్‌కు సంబంధించి 84 యూనిట్లకు 440, క్షత్రియ కార్పొరేషన్‌కు సంబంధించి 13 యూనిట్లకు 46, రెడ్డి కార్పొరేషన్‌కు సంబంధించి 75 యూనిట్లకు 363, వైశ్య కార్పొరేషన్‌కు సంబంధించి 16 యూనిట్లకు 120, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి 445 యూనిట్లకు 1,781 దరఖాస్తులొచ్చాయి. **తిరుపతి జిల్లాలో** అన్ని కార్పొరేషన్లకు కలిపి 2,082 యూనిట్లకు 17,543 దరఖాస్తులందాయి.బీసీ కార్పొరేషన్ ద్వారా 1160 యూనిట్లను మంజూరు చేస్తే 14,293దరఖాస్తులందాయి. బ్రాహ్మణ కార్పొరేషన్‌లో 9 యూనిట్లకు 40, ఈబీసీ వర్గాలకు 27 యూనిట్లకు 89, కమ్మ కార్పొరేషన్‌కు సంబంధించి 43 యూనిట్లకు 69, క్షత్రియ కార్పొరేషన్‌కు సంబంధించి 2యూనిట్లకు8, రెడ్డి కార్పొరేషన్‌కు సంబంధించి 32యూనిట్లకు 54, వైశ్య కార్పొరేషన్‌కు సంబంధించి 7యూనిట్లకు 12,కాపు కార్పొరేషన్‌కు సంబంధించి 560యూనిట్లకు 1872దరఖాస్తులొచ్చాయి.

● పూర్తయిన ఇంటర్వ్యూలు

బీసీ కార్పొరేషన్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 15వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మండలాలు, మున్సిపాలిటీల్లో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గత నెలలో జరిగిన జ్యోతిరావు పూలె జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని 30 మంది లబ్ధిదారులకు సంబంధించి రుణాల మంజూరు లెటర్లను కూడా ఇచ్చారు. ఈ లెటర్లు తీసుకున్న వారికి కూడా బ్యాంకుల్లో సబ్సిడీ పడలేదు. ఏప్రిల్ నెలలో యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉండగా ప్రక్రియ ఆగిపోయింది. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించి ఆ శాఖ అధికారులు దరఖాస్తులను స్వీకరించిన అనంతరం అలాగే ఆపేశారు.



● తక్కువ యూనిట్లే కారణం

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 5,021 యూనిట్లను మంజూరు చేయగా 39,047మంది దరఖాస్తు చేసుకున్నారు. యూనిట్లను ఆయా మండలాల్లోని జనాభాలో కులాల వారీగా విభజించి కేటాయించారు. ఇందులో సరాసరి ఒక్కో మండలానికి 40 నుంచి 100 యూనిట్ల వరకు, అదేవిధంగా సుమారు రెండు లక్షల జనాభా ఉన్న జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరపాలక సంస్థకు 170 యూనిట్లు, మిగిలిన పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి మున్సిపాలిటీలకు 140 నుంచి 160 యూనిట్ల వరకు కేటాయించారు. దుల సంఖ్యలో యూనిట్లు.. వందల సంఖ్యలో దరఖాస్తులు అందాయి.

వైసీపీ హయాంలో రుణాల కోసం ఎదురు చూసిన ఆశావహులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చాలా మందే దరఖాస్తు చేసుకున్నారు. తక్కువ సంఖ్యలో యూనిట్లు మంజూరు కావడంతో దరఖాస్తులు చేసుకున్న వారంతా ప్రజా ప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

ప్రజా ప్రతినిధులకు తలపోటు

ప్రజా ప్రతినిధులు తాము చెప్పిన వారికే రుణాలను మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలా చెప్పాలో తెలియక ఇటు ప్రజా ప్రతినిధులు.. అటు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దానికితోడు బ్యాంకర్లు సిబిల్ స్కోరు పేరుతో నానా తిప్పలు పెట్టారు. ఓ పక్క తక్కువ యూనిట్లు.. మరోపక్క పెద్దఎత్తున దరఖాస్తులు రావడంతో యూనిట్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులకు తగిన విధంగా యూనిట్లను పెంచి ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని సమాచారం.



నారావారి ఆహ్వానం!

రేపే సీఎం చంద్రబాబు గృహప్రవేశం

- నేడు కుటుంబంతో కుప్పం రాక
- నియోజకవర్గ ప్రజలకు విందు భోజనం

చంద్రబాబు నూతన గృహం





భోజనాలకోసం సిద్ధమైన టెంట్‌లు

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): నారావారి ఆహ్వానం అందుకున్నారు కుప్పం నియోజకవర్గ ప్రజలు. స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారంనాడు జరగనున్న తన గృహ ప్రవేశానికి సోషల్ మీడియా ద్వారా టీడీపీ కార్యకర్తలకు, ప్రజలకు శుక్రవారమే ఆహ్వానం పంపారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురం సమీపంలో చంద్రబాబు సొంత ఇల్లు నిర్మించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ఇంటి నిర్మాణం పూర్తైపోయి గృహ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ఆదివారం ఉదయం 10 గంటలకు గృహప్రవేశానికి ముహూర్తం నిర్ణయించారు. డిజిటల్ ఆహ్వాన పత్రికలను కుప్పం నియోజకవర్గ ప్రజలందరికీ అందేలా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'నా ప్రాణ సమానమైన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఇదేనా నూతన ఇంటి గృహప్రవేశ ఆహ్వానం. శివపురం వద్ద నూతనంగా నిర్మించిన ఇంటి గృహప్రవేశ వేడుకకు మిమ్మల్ని మరియు మీ కుటుంబ సభ్యులను సాదరంగా ఆహ్వానిస్తున్నాను.' అంటూ డిజిటల్ ఆహ్వాన పత్రికలో సాదరంగా ఆహ్వానం పలికారు చంద్రబాబు దంపతులు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లోనూ శనివారం సాయంత్రానికి లేదా రాత్రి వేళకు కుప్పం చేరుకోనున్నారు. ఆయన కుటుంబ సభ్యులైన నారా భువనేశ్వరి. లోకేశ్, బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ అంతకంటే ముందే కుప్పం చేరుకునే అవకాశం ఉంది. వీరంతా కుప్పంలోనే బసచేసి 25వ తేదీ అంటే ఆదివారం ఉదయం 10 గంటలకు గృహప్రవేశం చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులతో సహా కుటుంబ సభ్యులందరూ ఆ రాత్రికి సొంత గృహంలోనే నిద్ర చేస్తారు.26వ తేదీ ఉదయం కుప్పంనుంచి అమరావతి బయలుదేరి వెళ్తారు. ప్రస్తుతానికి అనధికారికంగా నిర్ణయించిన షెడ్యూల్ ఇది. ఈ షెడ్యూల్‌లో స్వల్ప మార్పుచేర్పులు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు.

10-20 వేలమందికి భోజనాలు

చంద్రబాబు గృహప్రవేశం సందర్భంగా 25వ తేదీ మధ్యాహ్నం నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, ప్రజలందరికీ విందు భోజనాలు పెట్టాలని నిర్ణయించారు. 'తప్పకుండా అందరూ విచ్చేసి, విందు స్వీకరించి ఆశీర్వదించవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.' అంటూ డిజిటల్ ఆహ్వాన పత్రికలో ప్రత్యేకంగా మరీ ముద్రించారు. కొన్ని ఆహ్వాన పత్రికలను ముద్రించారు కూడా. వీటిని శుక్రవారం సాయంత్రం అక్కడక్కడా టీడీపీ నాయకులు గ్రామాలలో ప్రజలకు పంచిపెట్టారు. సుమారు 10-20 వేల మందిదాకా భోజనాలకు వస్తారని పార్టీ, అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. నూతనంగా నిర్మించిన ఇంటివద్ద అందుకు తగిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వీవీఐపీలు, వీఐపీలు, సాధారణ ప్రజలకు వేర్వేరుగా టెంట్లు సిద్ధం చేస్తున్నారు. బఫే పద్ధతిలో ఎక్కడికక్కడ ప్రత్యేకంగా క్యాటరింగ్ సిబ్బంది వడ్డించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ భోజనాల హడావుడి అంతా ఇంటి బయటే విశాలమైన ఆవరణలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. గృహప్రవేశం నాడు సాధారణ ప్రజలకు ఇంట్లోకి ప్రవేశం ఉంటుందా? లేదా? అన్న విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. సాధారణ ప్రజలకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి ఇంటి లోపలికి అనుమతిస్తారని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు ఓచోట కూర్చుని వారి ఆశీర్వాదాలు స్వీకరించి పలకరిస్తారని అంటున్నారు. అయితే దీనిపై ఇప్పటి దాకా స్పష్టత లేదు.



కేడీ పల్లెలో ఆహ్వాన పత్రికలు పంచుతున్న టీడీపీ నేతలు

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

చంద్రబాబు గృహప్రవేశ కార్యక్రమం పూర్తిగా ప్రైవేటు కార్యక్రమమని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న, రాష్ట్ర ముఖ్యమంత్రి కాబట్టి ఆయన కుప్పం పర్యటన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ స్వయంగా తెలుసుకుంటున్నారు. వీరిద్దరూ శుక్రవారం కుప్పం వచ్చారు. శివపురం వద్ద గృహప్రవేశానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా చర్యలు, రూట్ మ్యాప్, జనాల రాకపోకలు వంటి అన్ని అంశాలనూ పరిశీలించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలోని హెలిప్యాడ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా దిగుతారని ప్రస్తుతం అనుకుంటున్నారు. అందుకని అక్కడ ఏర్పాట్లను సైతం పర్యవేక్షించారు. వి.కోట నుంచి కుప్పం వరకు రోడ్డుపక్కన ఉన్న చెట్లు, పొదలను తొలగించాలని, పారిశుధ్య నిర్వహణ చేయాలని, ముఖ్యమంత్రి పర్యటన మార్గమంతటా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భద్రతా చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. పార్కింగ్ ఏరియాను కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నందకిశోర్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, డీఎస్పీ పార్థసారథి,ఆర్డీవో శ్రీనివాస రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకు మోక్షం

- అక్టోబరు 2కల్లా తొలగించేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు



పలమనేరు కంపోస్టు యార్డు వద్ద చెత్తను ఎరువుగా మార్చేందుకు జిగ్మా కంపెనీ ఏర్పాటు చేస్తున్న యంత్ర సామగ్రి

పలమనేరు, మే 23(ఆంధ్రజ్యోతి) : చిత్తూరు కార్పొరేషన్, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, బి.కొత్తకోట, కుప్పం మున్సిపాలిటీల్లోని కంపోస్టుయార్డుల్లో పేరుకు పోయిన దాదాపు లక్ష టన్నులకు పైగా చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ ప్రారంభమవుతోంది.కంపోస్టు యార్డులకు కేటాయించిన స్థలాల్లో లక్షలాది టన్నుల చెత్త పేరుకు పోవడంతో మున్సిపాలిటీలకు సేకరించిన చెత్త వేసేందుకు స్థలం లేని పరిస్థితిని ఇటీవల మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కంపోస్టుయార్డుల్లో నిల్వ వున్న చెత్తను ఎరువుగా మార్చడం ద్వారా పేరుకు పోయిన చెత్తను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ ప్రక్రియను అక్టోబరు 2లోపు పూర్తిచేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థకు ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నేపథ్యంలో జిగ్మా సంస్థ పలమనేరు మున్సిపాలిటీలోని కంపోస్టు యార్డు వద్ద చెత్తను ఎరువుగా మార్చేందుకు అవసరమైన యంత్రసామగ్రిని సిద్ధం చేసుకుంటోంది. విద్యుత్ అంతరాయం తలెత్తినా ఇబ్బంది లేకుండా భారీ జనరేటర్‌ను కూడా సిద్ధం చేసింది. త్వరలోనే కంపోస్టుయార్డులోని చెత్తను ఎరువుగా మార్చనుంది. ఈ చెత్తలో వున్న ప్లాస్టిక్ కవర్లను వేరుచేసి వాటిని అవసరమైన కంపెనీలకు తరలిస్తారని తెలిసింది. పలమనేరు మున్సిపాలిటీలో దాదాపు 13 వేల టన్నుల చెత్త కంపోస్టు యార్డులో పేరుకు పోయిందని కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు.ఇప్పటికే క్యాబ్ సంస్థ కూడా పలమనేరు కంపోస్టుయార్డు వద్ద రోజూ వచ్చే చెత్తను ఎరువుగా మార్చే పని చేస్తోంది. కంపోస్టుయార్డులో ఉన్న చెత్తను ఎరువుగా మార్చి రైతులకు విక్రయిస్తారని కమిషనర్ తెలిపారు.

ఈత సరదా ప్రాణం తీసింది

ముక్కల చెరువులో ముగ్గురు చిన్నారుల మునక

బాలిక మృతి - కోలుకుంటున్న ఇద్దరు



లావణ్య(ఫైల్‌ఫొటో)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్

శ్రీరంగరాజపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన ఓ బాలిక మృతి చెందింది. ఇద్దరు చిన్నారులు ఆస్పత్రి పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా పొన్నైకి చెందిన లావణ్య(12) వేసవి సెలవులు కావడంతో ఎస్ఆర్‌పురం మండలంలోని 50బసివిరెడ్డిపల్లెలో ఉన్న మేనత్త లత ఇంటికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం లత తన పిల్లలు కార్తీక్(12), పల్లవి(9)తోపాటు అన్న కూతురు లావణ్యను తీసుకుని సమీపంలో ఉన్న ముక్కలచెరువులో చేపలు పట్టడానికి వెళ్లింది. ఆమె చేపలు పడుతుండగా, పిల్లలు చెరువులో సరదాగా ఈత నేర్చుకుంటున్నారు. ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి ముగ్గురూ మునిగిపోయారు. గమనించిన లత ఆ ముగ్గురినీ బయటకు తీశారు. స్పృహ కోల్పోయిన వారిని 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లావణ్య మృతి చెందగా, కార్తీక్, పల్లవికి చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరూ కోలుకుంటున్నారని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షల విరాళం



తిరుమల, మే23(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.17 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన పవ ర్‌మెక్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఎండీ సత్యరోహిత్ ఈ విరాళాన్ని అందజేశారు. రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు. వెంగమాంబ అన్నప్ర సాద భవనంలో ఒక పూట మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు వినియోగించాలని దాత కోరారు.

అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాత సత్యరోహిత్

'ఘాటు' రోడ్డుగా మార్చేస్తే ఎలా?



తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా ఘాట్‌లో మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. ఈ క్షేత్రంలో మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. అక్కడి భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ నిషేధిత వస్తువులు కొండకు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే మొదటి ఘాట్‌రోడ్డులో పలు చోట్లు ఖాళీ మద్యం సీసాలు, వాడేసిన గుట్కా ప్యాకెట్లు, సిగరెట్ ప్యాకెట్లు ఉండటం భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈమార్గంలో మరమ్మతు పనులు చేస్తున్న కొందరు కార్మికులే వీటిని వాడుంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టు మెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,579

తలనీలాలు సమర్పించినవారు: 34,067





'శ్రీవారి సేవ'ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేలా టీటీడీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చాక సేవకులకు అవకాశం కల్పించాలని భావిస్తోంది. తద్వారా భక్తులకు మరింత బాధ్యతగా సేవలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవకు ప్రత్యేక శిక్షణ

- ఆ తర్వాతనే సేవకులుగా అవకాశం
- ప్రణాళిక రూపొందిస్తున్న టీటీడీ

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో 2000 నవంబరు 1న టీటీడీ 'శ్రీవారిసేవ'ను ప్రారంభించింది. 195 మందితో ప్రారంభమైన ఈ సేవలో ఇప్పటివరకు 16 లక్షల మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఇప్పుడు వివిధ విభాగాల్లో రోజుకు 2,500 మంది సేవలందిస్తున్నారు. ప్రస్తుతం వచ్చే శ్రీవారి సేవకుల్లో 10 శాతం పాతవారుంటే.. 90 శాతం కొత్తవాళ్లు. ఈక్రమంలో సేవలు అందించే విధానంలో కొన్ని లోపాలు ఎదురవుతున్నట్టు తమ పరిశీలనలో అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో 50 శాతం చొప్పున కొత్త, పాత వారికి సేవ చేసే అవకాశం కల్పించాలని టీటీడీ భావిస్తోంది. ఇందులో భాగంగానే ఎలాంటి సమయ నిబంధన లేకుండా త్వరలో ఓపెన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించాలనే యోచనలో ఉంది. సేవకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని భావిస్తోంది. దీనికి తిరుపతితో పాటు మండల, జిల్లాస్థాయిల్లో ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇలా శిక్షణ పొంది సేవకు వచ్చేవారికి తిరుమలలోని పలు విభాగాల్లో సేవ చేసే అవకాశం కల్పిస్తారు. వీరికి సీనియర్లుగా ఉన్న సేవకులను గ్రూప్‌లీడర్‌గా ఏర్పాటు చేస్తారు. వీరు పర్యవేక్షకులుగా ఉంటూ సేవకుల పనితీరును పరిశీలించి రికార్డు చేస్తారు. మెరుగైన సేవలు అందించే వారి ఆధార్ సహా పూర్తివివరాలను టీటీడీ డేటాబేస్‌లో నమోదు చేస్తారు. ఇలా కొంతకాలం నిర్వహిస్తే శ్రీవారి భక్తులకు సేవకుల ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని టీటీడీ భావిస్తోంది. మరోవైపు ప్రస్తుతమున్న ఏడు రోజుల సేవే కాకుండా నెల, మూడు నెలల సేవలను కూడా ప్రారంభించాలని టీటీడీ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా వివిధ దేశాల్లో స్థిరపడిన భక్తులు కూడా సేవ చేసేందుకు మక్కువ చూపుతున్న క్రమంలో త్వరలో 'ఎన్ఆర్ఐ శ్రీవారిసేవ'ను కూడా ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇక, 'వృత్తిపరమైన సేవ' కింద వైద్యం, ఐటీ, డెయిరీఫాం విభాగాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నవారికి కూడా సేవచేసేందుకు అవకాశమివ్వాలని టీటీడీ ప్లాన్ చేస్తోంది.

సీఎం ఆదేశాలతో...

భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణా పరమైన సూచనలను, సలహాలను తీసుకోవాలని టీటీడీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో సత్యసాయి సేవా సంస్థ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా ఫౌండేషన్‌లను ఇప్పటికే టీటీడీ అధికారుల బృందం సందర్శించింది. అలాగే శ్రీవారి సేవ నిర్వహణకు సంబంధించి సత్యసాయి సేవా సంస్థ కూడా మార్చి నెలలో ఐదురోజుల పాటు తిరుమల, తిరుపతిలో పర్యటించి నివేదికను టీటీడీ అందజేసింది.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

యోగాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025పై ప్రజలకు అవగాహన కల్పించి నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యోగాంధ్ర-2025 నిర్వహణపై జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, విజయవంతానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. 29న తిరుపతి, జూన్ 4న చంద్రగిరికోట, 11న శ్రీకాళహస్తి/శ్రీహరికోట, 17న శ్రీహరికోట/శ్రీకాళహస్తిలో యోగాపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో రాఘవేంద్రరావు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి - బండ్ల గణేష్, కేవీ రావు, రాఘవేంద్రరావు, సతీష్ వేమన

తిరుమల, మే23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శించుకున్నారు. ఇంకా నిర్మాతలు బండ్ల గణేష్, కేవీ రావు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శంకరనారాయణ పీఠాధిపతి జగద్గురు కంచి స్వామి ఉన్నారు. అంతకుముందు రాఘవేంద్రరావు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. దర్శనం తర్వాత రాఘవేంద్రరావు మీడియాతో మాట్లాడుతూ, పుట్టిన రోజున తాను స్వామి అభిషేక సేవలో పాల్గొనడంతో తన జన్మ ధన్యమైందన్నారు. శ్రీవారి సేవలకు తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానన్నారు. కాగా, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత బండ్ల గణేష్, తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మర్యాదపూర్వకంగా కలిశారు.

నాయుడుపేట సీహెచ్‌సీలో రహస్యంగా అంతర్గత విచారణ

నాయుడుపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నతాధికారులు రహస్యంగా శుక్రవారం విచారణ చేపట్టారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ విజయవాడ ఆధ్వర్యంలో డాక్టర్ నాగలక్ష్మి విచారణ అధికారిగా తన బృందంతో విచారణ సాగించారు. ఆమెతో పాటు బృంద సభ్యులంతా సాధారణ రోగులతో కలిసి ఉదయం 9 నుంచి రాత్రి 11.30 గంటల వరకు పలు వివరాలు సేకరించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళపై పలు ఆరోపణలు రావడంతో ఈ విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో ఓపిలు ఇచ్చే విధానం, సిబ్బంది పనితీరు, ఔషధాల పంపిణీ, ల్యాబ్‌ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు ఫైళ్లను పరిశీలించారు. రక్తనిధికి సంబంధించిన నిధులు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డిఎస్) కమిటీని ఇంత వరకు నియమించకపోవడం దాని ద్వారా దాదాపు 7.5 లక్షల రూపాయలు నిధులు వెనక్కు మళ్లినట్లు గుర్తించారు. నాయుడుపేట సీహెచ్‌సీ పనితీరుపై సమగ్ర నివేదికను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉన్నతాధికారులకు అందించనున్నారు.

అట్టహాసంగా సీపీఎల్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(క్రీడలు), మే 23(ఆంధ్రజ్యోతి): తారకరామ మైదానంలో శుక్రవారం ఉదయం చిత్తూరు ప్రీమియర్ లీగ్ సీజన్ 1 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన నగర కమిషనర్ మౌర్య క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో సీపీఎల్ మ్యాచ్‌లు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇక్కడే ప్రతిభకు పునాదులు వేసుకోవాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ సత్తాచాటిన క్రీడాకారులకు ఐపీఎల్, జాతీయ జట్లలో స్థానం లభించే అవకాశాలున్నాయన్నారు.

తొలిరోజు ఫలితాలిలా...

- మొదటి పోటీలో హైపీరియన్ జట్టుపై ఆదిత్య జట్టు విజేతగా నిలిచింది. అభిషేక్‌రెడ్డి 80 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందాడు.
- రెండో పోటీలో రాయల్‌చాలెంజ్ జట్టుపై పాయ్‌వైస్రాయ్ జట్టు గెలుపొందింది. సూర్య 33 పరుగులు, రెండు వికెట్లు పడగొట్టి జట్టు విజయానికి బాటలు వేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు.

దుగరాజపట్నంలో పోర్టు నిర్మించాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేస్తున్న చింతా మోహన్

గూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నంలో నౌకానిర్మాణ కేంద్రం కాదు, మేజర్ పోర్టు కావాలి అని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపిన ఆయన, అనంతరం ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ పోర్టుకు ఇక్కడ అనుమతిచ్చిందన్నారు. ఇది పూర్తి చేయకుండా ప్రజల చెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. మేజర్ పోర్టు నిర్మాణం పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు వస్తాయన్నారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు కాగా నిరుద్యోగ బ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు ఇసుక, క్వార్ట్జ్, సిలికా వంటి సహజ సంపదను కేటాయించాలన్నారు. కృష్ణా నదిలో కడుతున్న అమరావతి రాజధాని సక్సెస్ కాదని అన్నారు. అక్కడ నిర్మాణ వ్యయం పదింతలు పెరుగుతుందని, కూటమి నేతలు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, శివ, పెంచలయ్య, పూల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం షాపుల వద్ద నిరంతర నిఘా

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



తిరుపతిలో దుకాణం వద్ద..

తిరుపతి(నేరవిభాగం), మే 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మద్యం షాపుల వద్ద నిరంతర నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ విజయశేఖర్ చెప్పారు. తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం షాపులకు సంబంధించి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయాలను పాటించాలన్నారు. మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా తాగినా, అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేయాలన్నారు. దుకాణాల వద్ద గొడవలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో తిరుపతి జిల్లా ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, ఈఎస్ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.

యశ్వంతపూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యం

తిరుపతి(సెంట్రల్), మే 23(ఆంధ్రజ్యోతి): యశ్వంతపూర్-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం 4 గంటలు ఆలస్యంగా తిరుపతికి చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తిరుపతికి నాలుగు గంటలకు చేరుకోవాల్సి ఉండగా రాత్రి 8గంటలకు వచ్చింది. ప్రయాణికులు సకాలంలో చేరుకోలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మరో వైపు హౌరాకు వెళ్లాల్సిన ప్రయాణికులు కూడా స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రారంభ స్టేషన్‌లోనే ఆలస్యంగా బయలుదేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నడిరోడ్డుపై మందుబాబు హల్‌చల్



శ్రీకాళహస్తి, మే 23(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై బైఠాయించి మద్యం తాగుతూ మందుబాబు హల్‌చల్ చేశాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ కూడలి నిత్యం రద్దీగా ఉండే మార్గం. శుక్రవారం ఓ మందుబాబు మద్యం కొని పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపుకు వెళ్లాడు. గ్లాసు, నీరు, కూల్‌డ్రింక్, చిప్స్, ఇతర ఆహార పదార్థాలు కొన్నవారినే మద్యం తాగేందుకు అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు. దాంతో ఉచితంగా మద్యం తాగేందుకు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలంటూ అతడు నడిరోడ్డుపై మందు సీసాతో తిష్టవేశాడు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మందుబాబును అదుపులోకి తీసుకుని బహిరంగంగా మద్యం తాగడంపై కేసు నమోదు చేశారు.

రూ.765 కోట్లు కావాలి

- బాలాజీ, మల్లిమడుగు రిజర్వాయర్లకు ప్రతిపాదన పంపిన జీఎన్ఎస్ఎస్

రేణిగుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న బాలాజీ, మల్లిమడుగు రిజర్వాయర్ల పనులకు రూ.765 కోట్లు కావాలని గాలేరు నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) డివిజన్ అధికారులు ప్రతిపాదనలను పంపించారు. తిరుమల శ్రీవారి భక్తులకు, తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు, అలాగే కాలువ నిర్మాణాలకు టెండర్లను పిలిచి గతంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం పనులు అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. బాలాజీ, మల్లిమడుగు ప్రాజెక్టులను గాలికి వదిలేసింది. గతేడాది సీఎం అయిన చంద్రబాబు ఈ రిజర్వాయర్లపై సమీక్ష నిర్వహించి బ్యాలెన్స్ పనులను అంచనాలు పంపాలని ఆదేశించారు. దీంతో రూ.765 కోట్లు అంచనా వేసి ప్రతిపాదనలు పంపించామని జీఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్ మల్లిమడుగు డీఈ చంద్రమౌళి తెలిపారు.

ఎంత కట్టినా.. తీరని బాకీ!

- పలు లోన్ యాప్‌ల తీరు
- వీరి వేధింపులతో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు

- తిరుపతి మధురానగర్‌కు చెందిన 30 ఏళ్ల యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ లోన్‌యాప్‌లలో రుణాలు తీసుకున్నాడు. ఎంత కట్టినా బకాయిలు ఉన్నాయంటూ నిర్వాహకులు వేధించారు. మరోవైపు లక్షలాది రూపాయలు అప్పుల పాలై తీర్చలేక తిరుపతికి వచ్చి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు.
- తాజాగా శుక్రవారం తిరుపతిలోని ఆర్.వెంకటేశ్వర రాజు (30) కూడా లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులకు బలయ్యాడు. జిల్లాలో ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇందులో కొన్ని బయటకు రాకపోగా.. కొన్ని మాత్రం కేసులు నమోదవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఇటీవల కొందరు యువత బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడుతున్నారు. బెట్టింగులో రూ.లక్షలాదిగా నష్టపోతున్నారు. అలాంటి సమయాల్లో వీరి సెల్‌ఫోన్లకు లింకులు వస్తున్నాయి. అడగకపోయినా రుణాలు ఇస్తామంటూ మెసేజీలు పంపుతున్నారు. ఎలాగైనా బెట్టింగులో పోయిన డబ్బులు రాబట్టుకోవాలని యువత ఈ లింకులను క్లిక్ చేస్తున్నారు. రుణాలు పొందుతున్నారు. ఈ క్రమంలో వీరి ఫోనులోని కాంటాక్టు ఫొటో గ్యాలరీ యాక్సెస్‌ను నిర్వాహకులు తీసుకుంటారు. దీని వల్ల ఫోన్‌లోని ఫొటోలు, కాంటాక్టు నెంబర్లు వంటి వివరాలన్నీ యాప్‌ల నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. లోన్ మంజూరు చేసిన తర్వాత రోజు నుంచి చెల్లింపుల కోసం ఒత్తిడి ప్రారంభిస్తారు. వాయిదాలను సకాలంలో కట్టకపోయినా, చెప్పినంత వడ్డీ చెల్లించక పోయినా ఫోన్‌లోని కాంటాక్టు నెంబర్లకు మార్ఫింగ్ చేసిన ఫొటోలు పంపిస్తామని బెదిరిస్తున్నారు. కొన్ని యాప్‌ల నిర్వాహకులైతే అసలు, వడ్డీ చెల్లించినా ఇంకా బకాయి ఉందంటూ వేధిస్తున్నారు. కాంటాక్ట్ నెంబర్లకు పంపిస్తామని బెదిరిస్తుండటంతో బాధితులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఈ ఘటనల్లో కేసులు నమోదైనా.. దొంగపత్రాలతో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు ఉండటంతో యాప్ నిర్వాహకులు చిక్కడం లేదు.

లోన్‌యాప్‌ల వలలో పడొద్దు

యువకులు, విద్యార్థులు, మహిళలు లోన్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేయొద్దు. లోన్‌యాప్‌ల ఉచ్చులో పడి మోసపోవద్దు. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం. - వినోద్‌కుమార్, సైబర్ క్రైం సీఐ

లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి



ఆత్మహత్యకు పాల్పడిన వెంకటేశ్వరరాజు

తిరుపతి(నేరవిభాగం), మే 23(ఆంధ్రజ్యోతి): లోను యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఆర్.రామచంద్రరాజు కుమారుడు వెంకటేశ్వర రాజు బీ-టెక్ వరకు చదివాడు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌కు అలవాటుపడ్డాడు. రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఈ క్రమంలో తన మొబైల్‌కు వచ్చిన మెసేజీల ద్వారా లోన్ యాప్‌ల నుంచీ రుణం పొందాడు. మొత్తమ్మీద రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు అప్పులయ్యాయి. ఇటీవల లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు ఎక్కువ కావడంతో, తండ్రికి విషయం చెప్పాడు. కుమారుడికి బుద్దులు చెప్పిన ఆయన.. తిరుపతిలోని ప్లాటు అమ్మి రూ.25 లక్షల వరకు అప్పు తీర్చారు. అయినా, ఇంకా రుణం చెల్లించాలని నిర్వాహకుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వరరాజు శుక్రవారం అమ్మవారి ఆలయానికి వెళ్లొచ్చాడు. తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లడంతో.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు తలుపులు తీసి చూసే సరికి కుమారుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ డ్రైవరు నిర్బంధం

- కుమారుడు అపహరించిన డబ్బులు కట్టి వెళ్లాలని వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి(నేర విభాగం), మే 23 (ఆంధ్రజ్యోతి): కుమారుడు ఇవ్వాల్సిన డబ్బులకు తండ్రిని నిర్బంధించి...బయటపెట్టి వేధించిన ఘటన ఆలస్యంగా శుక్రవారం రాత్రి వెలుగు లోకి వచ్చింది. ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య కథనం మేరకు.. పూతలపట్టు మండలం ఈడిగపల్లికి చెందిన సత్యనారాయణ చిత్తూరు ఆర్టీసీ 2డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. డ్రైవరు కాకముందు ఈయన గంగాధరనెల్లూరుకు చెందిన విజయశేఖర్ వద్ద బెంగళూరులో సిమెంట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. డ్రైవరుగా ఉద్యోగం రావడంతో తన కుమారుడు సాగర్‌ను అక్కడ చేర్పించారు. ఇతడు అక్కడ వసూలయ్యే డబ్బులో రూ.30 లక్షలు అపహరించాడు. దీంతో విజయశేఖర్ రెండు రోజుల క్రితం తిరుపతికి వచ్చి సత్యనారాయణను పిలిపించారు.కృష్ణానగర్‌లోని తన ఇంట్లో నిర్బంధించారు.అతడి కుమారుడు తీసుకెళ్లిన డబ్బులు ఇచ్చి వెళ్లాలని చిత్రహింసలకు పాల్పడ్డాడు. ఆ తర్వాత వారికి నచ్చచెప్పి బయటకు వచ్చిన సత్యనారాయణ.. శుక్రవారం రాత్రి ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రామయ్య కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఆసియా ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు) మే 23(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆలిండియా చెస్ ఫెడరేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఫస్ట్ ఏషియన్ ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలో తిరుపతి జువైనల్ హోంలోని బాలబాలికల జట్లు ప్రతిభ కనబరిచాయి. మంగళంలోని బాలుర జువైనల్ హోం జట్టు ప్రథమ.. రాజన్న పార్కు వద్దనున్న బాలికల జువైనల్ హోం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఆసియాలోని 19 దేశాల బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను హైదరాబాదుకు చెందిన ఐటీసీఎల్ ప్రతినిధి తిమ్మప్ప, ఆర్బిటర్ మల్లికార్జున, కోచ్‌లు సుధాకర్, సదాశివన్ పర్యవేక్షించారు.



నిమిషం ఆలస్యమైనా అనుమతించం

- రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు
- జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), మే 23 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ హన్సవదన, ప్రత్యేకాధికారి, సంయుక్త కార్యదర్శి ఎస్‌జి అజ్మీర అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో ఆదివారం జరిగే ఈ పరీక్షలకు 5,261మంది హాజరుకానున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్!



కుప్పంలో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని ఎదురొడ్డి నిలిచే శక్తి ఏ దేశానికీ, ఉగ్రమూకలకూ లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు అన్నారు. పాకిస్తాన్‌పై, అది పెంచి పోషిస్తున్న ఉగ్రమూకలపై భారత్ సేనలు సాధించిన విజయానికి చిహ్నంగా కుప్పంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వంలోని రాజకీయ పార్టీలు తిరంగా ర్యాలీ నిర్వహించాయి. కుప్పం చెరువుకట్టనుంచి ప్రారంభమైన ర్యాలీ నేతాజీరోడ్డు మీదుగా గాంధీ విగ్రహం దాకా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కూల్చే కుట్రలను ప్రధాని మోదీ, భారత సైన్యం వీరోచితంగా ఎదురొడ్డి, విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ విజయంపై కుట్రపూరితమైన ప్రచారం చేస్తున్నవారు భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు భంగకరంగా పరిణమించారన్నారు. ఇటువంటి కుట్రలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, సంఘ విద్రోహ శక్తులకు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. జాతీయ జెండాలు ధరించి, సాగిన తిరంగా ర్యాలీ దేశభక్తిని ప్రేరేపించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సాంబశివం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్, బీజేపీ నాయకుడు ఎన్ఎస్.తులసీనాథ్‌తోపాటు ఎన్డీయే పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చెరువుకోనలో ఏనుగుల మకాం

సోమల, మే 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో సంచరిస్తున్న 16 ఏనుగుల్లో గురువారం రాత్రి చెరువుకోనలో నాలుగు ఏనుగులు దారి తప్పి మకాం వేసినట్లు ఇర్లపల్లె రైతులు తెలిపారు. ప్రతి ఏడాది ఏనుగుల మంద చెరువుకోనకు వస్తాయి. ఇక్కడి నుంచి ఆవులపల్లె, రాంపల్లె బీట్, పత్రపల్లె, రెడ్డివారిపల్లె మీదుగా పేటూరు పంచాయతీలోని కనికల చెరువు వద్దకు చేరుకుంటున్నాయి. నెల రోజులుగా సదుం, పులిచెర్ల మండలాల వైపు మళ్లిన ఏనుగులు ఉన్నపాటున సోమల మండలంలోకి ప్రవేశించి మామిడి, టమోటా పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 63 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం ఏపీ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీసెట్)కు మంది 63 మంది గైర్హాజరైయారు. రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షల్లో 1,230 మంది విద్యార్థులకు 1,167 మంది హాజరవగా, 63 మంది గైర్హాజరైయారు. ఫస్టు సెషన్‌లో 613 మందికి 580 మంది, రెండో సెషన్‌లో 617 మందికి 587 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రజలకు కొవిడ్‌పై అవగాహన కల్పించండి

ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ సూచన

చిత్తూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూడా కొవిడ్ కేసులు నమోదు కావడంతో ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ వీరపాండ్యన్ సూచించారు. శుక్రవారం విజయవాడనుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో పాటించిన నియమాల్లో భాగంగా మాస్కులు వేసుకోవడం, సోషల్ డిస్టెన్స్ పాటించడం, హ్యాండ్ వాష్ తరచుగా చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కొవిడ్‌పై ఎలాంటి భయభ్రాంతులకు గురికావాల్సి అవసరం లేదన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరికీ అభ ఐడీ నమోదు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మాతాశిశు మరణాలు సంభవించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీ సర్వేపై అధికారులు దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. డీఎంహెచ్‌వో సుధారాణి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై లెదర్ స్టిచ్చింగ్ ఆపరేటర్, లెదర్ ఫుట్‌వేర్, లెదర్ కట్టర్ ఫుట్‌వేర్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఈ కోర్సులో చేరాలనుకునే ఎస్సీ కులానికి చెందినవారు టెన్త్ పాసై.. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. 45 రోజులపాటు శిక్షణ ఇచ్చే ఈ కోర్సులో చేరేవారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. కోర్సు పూర్తయ్యాక కిట్టును ఉచితంగా అందిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు నెల్లూరు జిల్లాకు సంబంధించి 98493 73131, కర్నూలు జిల్లాకు సంబంధించి 63056 88868 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

25న స్క్రీనింగ్ పరీక్ష

చిత్తూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లోని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లలో ప్రవేశానికి బాలబాలికలకు ఆదివారం రెండో స్క్రీనింగ్ పరీక్ష జరగనుంది. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ పక్కన ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారి గీత ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యేవారు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను తీసుకుని ఉదయం 11 గంటలకంతా రావాలని సూచించారు.

శిశువిహార్‌కు 10 నెలల చిన్నారి, మూడేళ్ల పాప

● అమ్మానాన్న వదిలిపెట్టేయడంతో చేరదీసిన ఐసీడీఎస్



స్టేషన్ వద్ద పిల్లలతో ఐసీడీఎస్ అధికారులు

వి.కోట, మే 23 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో ఓ దుకాణం వద్ద ఇద్దరు పిల్లలను వారి తల్లిదండ్రులే వదిలి వెళ్లారు. నాలుగు రోజుల క్రితం అంజనేయ స్వామి ఆలయం వద్ద పాతసామాన్లు కొనుగోలు చేసే దుకాణం వద్దకు భార్యాభర్తలు పిల్లలతో వచ్చారు. వారు తెచ్చిన వస్తువులను అక్కడ ఇచ్చారు. వర్షం పడుతుండడంతో పిల్లలను కాసేపు ఇక్కడ వదిలి వెళతామని, తిరిగి వచ్చి తీసుకెళతామని చెప్పి సాయంత్రం వెళ్లారు. రాత్రి చీకటి పడినా రాకపోవడంతో దుకాణ యజమాని తన వద్ద పనిచేసే వ్యక్తికి ఇద్దరు పిల్లలను ఇచ్చాడు. దీంతో ఇటుకరాళ్లపల్లెలో మామిడి తోటలో తాను కాపలాగా ఉండే చోట వారిని ఉంచుకున్నాడు. నాలుగు రోజులు గడచినా వారి కోసం తల్లిదండ్రులు తిరిగి రాకపోవడంతో స్థానికంగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త సమాచారాన్ని ఐసీడీఎస్ అధికారులకు తెలిపింది. దీంతో శుక్రవారం సీడీపీవో అరుణశ్రీ ఇటుకరాళ్లపల్లె గ్రామానికి చేరుకుని ఇద్దరు పిల్లలను పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ఐసీడీఎస్ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. తన పేరు సీత అని మూడేళ్ల పాప చెబుతోందని, 10 నెలల బాబు తన తమ్ముడు అని, మిగిలిన వివరాలు చెప్పకపోవడంతో వారిని చిత్తూరు శిశువిహార్‌కు తరలించనున్నట్లు సీడీపీవో అరుణశ్రీ వివరించారు.

టీ బంకుల్లో విమర్శలు మానండి!

● అభివృద్ధిని ప్రచారం చేయండి
● మినీ మహానాడులో టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ కంచర్ల హితవు
● కుప్పం అభివృద్ధిపై 9 తీర్మానాలు



మినీ మహానాడులో ప్రసంగిస్తున్న కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): 'చెడు ఏదైనా ఉంటే చెవిలో చెప్పాలి.. మంచిమాట నలుగుర్లో చెప్పాలి.. కానీ మనదగ్గర అది రివర్స్‌లో జరుగుతోంది.. మనలో మనమే ఒకరిమీద ఒకరు టీ బంకుల దగ్గర విమర్శలు చేసుకుంటున్నాం.. ముందు ఈ పద్ధతి మానుకోవాలి.' అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ టీడీపీ శ్రేణులకు హితవు పలికారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న పథకాలు, పనుల గురించి ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమాన్ని స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంచర్ల శ్రీకాంత్ పార్టీలోని నాయకులు, కార్యకర్తల వ్యవహారశైలిపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కుటుంబ సభ్యుల మధ్య విభేదాలుంటే సోషల్ మీడియాకు ఎక్కి ఊరూ వాడా ప్రచారం చేసుకుంటామా? కానీ మీలో చాలా మంది పార్టీలో అంతర్గతంగా చర్చించాల్సిన విషయాలను టీ బంకుల దగ్గర బహిరంగపరచి పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు.' అని అసహనం వ్యక్తం చేశారు. ఇది మంచిపద్ధతి కాదని, మన ఇల్లు మనం కూల్చుకోవడమేనని హితవు పలికారు. నియోజకవర్గంతోపాటు రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ పనిమాత్రం ఎవరూ చేయడంలేదని తప్పుపట్టారు. ఇకమీదట పొరపాట్లు జరగకూడదని, అభివృద్ధిపైనే ప్రచారం ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు.కడప జిల్లాలో జరగనున్న మహానాడుకు వేలాదిగా పార్టీ శ్రేణులు నియోకవర్గం నుంచి తరలిరావాలని, మండలాల, పంచాయతీల బాధ్యులు ఈ బాధ్యత తీసుకోవాలని సూచించారు. శాంతిపురం మండలంలో చంద్రబాబు గృహప్రవేశం గురించి ప్రస్తావిస్తూ, ఈ శుభ కార్యానికి నాలుగు మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి భోజనాలు చేసి వెళ్లేలా పార్టీ శ్రేణులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు, ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి 9 తీర్మానాలను ఆమోదించారు. రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు వీజీ.ప్రతాప్, సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, బార్లపై చర్యలు

ఎక్సైజ్ డీసీ విజయ శేఖర్



చిత్తూరు దర్గా సర్కిల్‌లోని మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ డీసీ, ఈఎస్ తదితరులు

చిత్తూరు సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయ శేఖర్ హెచ్చరించారు. చిత్తూరు నగర పరిధిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎక్సైజ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటలవరకు, బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. ఎవరైనా సమయపాలన పాటించకుండా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణ కిషోర్, సీఐ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ



డీలర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జూన్ ఒకటో తేదీన రేషన్‌షాపులను అందంగా అలంకరించి, పండగ వాతావరణంలో బియ్యం కార్డుదారులకు సరుకుల పంపిణీ ప్రారంభించాలని జేసీ విద్యాధరి అన్నారు. శుక్రవారం జేసీ మీటింగ్ హాలులో డీలర్లతో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భగా జేసీ మాట్లాడుతూ.. ఎండీయూ వాహనాలను ఈనెలాఖరుతో నిలిపేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందువల్ల ఇకనుంచి రేషన్‌షాపుల్లోనే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలన్నారు. నెలాఖరులోగా ఎంఎల్ పాయింట్ల నుంచి స్టాకును దించుకుని టాంటాం ద్వారా కార్డుదారులకు కొత్త విధానం గురించి తెలియజేయాలన్నారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీవరకు కార్డుదారుల సౌలభ్యం కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్‌షాపులు పనిచేస్తాయన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. అన్ని దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నిబంధన మేరకు సరుకులను సరఫరా చేయాలని, ఫిర్యాదులొస్తే విచారించి, తప్పని తేలితే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. శనివారం మండల స్థాయిల్లో తహసీల్దార్లు డీలర్లతో సమావేశాన్ని నిర్వహించి, ప్రభుత్వ సూచనలను తెలియజేయాలని ఆదేశాలిచ్చారు. తొలుత జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ప్రభుత్వ ఆదేశాలను స్వాగతిస్తూ జేసీకి పుష్పగుచ్ఛం అందించారు. డీఎస్వో శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తన చావుకు భర్తే కారణమంటూ సూసైడ్ నోట్



నందిని (ఫైల్ ఫొటో)



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న నందిని తల్లిదండ్రులు, బంధువులు

బంగారుపాళ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని తంబుగానిపల్లె పంచాయతీ వెంకటాపురం దళితవాడకు చెందిన సుధాకర్, బుజ్జిల కుమారుడు ఉదయ్‌కిరణ్‌కు.. పెనుమూరు మండలం మఠంపల్లెకి చెందిన రెడ్డెప్ప, లావణ్య దంపతుల కుమార్తె నందిని (21)తో మూడేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా పిల్లలు పుట్టలేదన్న కారణంతో భర్త, అత్త వేధింపులకు గురిచేసేవారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేనప్పుడు సూసైడ్ నోట్ రాసిపెట్టి, శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో తన చున్నీతో బీరువా కున్న కొక్కీకి ఉరేసుకుంది. కొంతసేపటికి బీరువా కిందపడి పెద్ద శబ్దం రావడంతో సమీపంలో ఉంటున్నవారు ఇంట్లోకి వెళ్లారు. అక్కడ చూడగా బీరువా కింద నందిని అపస్మారకస్థితిలో ఉండడాన్ని గమనించి వెంటనే బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో తన చావుకు భర్త ఉదయ్ కిరణ్, అత్త బుజ్జిలే కారణమని రాసి ఉందని సీఐ తెలిపారు. శవపంచనామాను తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నందిని తల్లి లావణ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో భర్త, అత్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వే పనుల గడువును 140 రోజులకు పెంచండి

జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం వినతి



జయరాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్వే ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీసర్వే పనుల గడువును 60 నుంచి 140 రోజులకు పెంచాలని జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో సర్వేశాఖ ఏడీ జయరాజ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. గడువు పెంచితే పొరబాట్లు లేకుండా వందశాతం స్వచ్ఛమైన రికార్డులను తయారు చేయవచ్చని తెలిపారు. ఒక గ్రామంలో చేపట్టిన సర్వే వందశాతం పూర్తయ్యాకే మరో గ్రామంలో పనులు చేపట్టేలా షెడ్యూల్ రూపొందించాలన్నారు. సర్వే పనులు తప్ప మరే పనులను సర్వేయర్లకు కేటాయించరాదని గతంలో సీసీఎల్‌ఏ ఎస్ఎస్ఎల్‌ఆర్ ఇచ్చిన మార్గదర్శకాలను జిల్లాలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్వేయర్ల పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితా రూపొందించాలని డిమాండ్ చేశారు. డిప్యుటేషన్‌పై మండలాల్లో ఉన్న గ్రామ సర్వేయర్ల సేవలను ఎఫ్‌లైన్, సబ్ డివిజన్, రెవెన్యూ, రీసర్వే గ్రీవెన్స్‌ల పరిష్కారానికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనివేళలు కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేటాయించాలని విన్నవించారు.

ఎందుకైనా మంచిదని..!

● రుయాలో సిద్ధం చేసిన కొవిడ్ పరీక్షా కేంద్రం, పడకలు



రుయాస్పత్రిలో సిద్ధం చేసిన పడకలు

తిరుపతి(వైద్యం), మే 23(ఆంధ్రజ్యోతి): విశాఖలో కొవిడ్ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ కట్టడికి తిరుపతిలో ముందస్తుగా సన్నద్ధమవుతున్నారు. రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో కొవిడ్ కేంద్రాలను, ప్రత్యేక వార్డులను సిద్ధం చేశారు. జిల్లాలో కొవిడ్ లక్షణాలు లేవని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు అంటున్నారు. అయితే, ముందు జాగ్రత్తలు, నిబంధనలు పాటించడం మంచిదని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రుయాలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసినట్లు సూపరింటెండెంట్ రాధ శుక్రవారం చెప్పారు. కొవిడ్ పరీక్షలు చేసేందుకు కిట్లు, మందుల కోసం నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులను అప్రమత్తం చేసి కొవిడ్ కట్టడికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. 'జిల్లాలో ఎలాంటి కేసులు, లక్షణాలు లేవు. అయినా, నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల ప్రాంతం కావడంతో తిరుపతిలో రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో కొవిడ్ పరీక్షా కేంద్రాలను, మందులను, సిబ్బందిని సిద్ధం చేశాం. అవసరమైన పరీక్షల కిట్లు, మందుల కోసం నివేదికలు పంపాం. ప్రస్తుతం ఉన్న వాటితోనే కొవిడ్ కట్టడికి సిద్ధంగా ఉన్నాం' అని ఆయన చెప్పారు.

పొలాలకు తాగునీరు!

● వాటర్ ట్యాంకు నుంచి వైసీపీ నేత పైపులైను





ఓబిరెడ్డిపల్లె వాటర్ ట్యాంకు నుంచి వ్యవసాయ పొలాలకు వేసిన పైపు

పుంగనూరు రూరల్, మే 23: గ్రామంలో తాగునీటి సమస్య తీర్చడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు నుంచి పైపులు వేసి వ్యవసాయ పొలాలకు నీళ్లు మళ్లించిన వైసీపీ నేత వుదంతమిది. పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ ఓబిరెడ్డిపల్లెలో ప్రభుత్వం తాగునీటి నిల్వ కోసం ట్యాంకు ఏర్పాటు చేసింది. ఆ ట్యాంకు నిండిన తర్వాత నీటిని గ్రామంలోని పైపులైన్ ద్వారా గ్రామస్తులకు సరఫరా చేస్తున్నారు.త్రీ ఫేజ్ కరెంటున్న సమయంలో బోరు మోటర్ ద్వారా రెండు గంటల్లో ట్యాంక్ నిండిపోతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే గ్రామానికే చెందిన వైసీపీ నాయకుడొకరు 7గంటల పాటు మోటర్ వేసి పొలాలకు నీరు మళ్లించి సాగు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.వైసీపీ ప్రభుత్వ కాలం నుంచీ ఆయన పొలాలకు ఇదేవిధంగా నీరు పారుతున్నట్లు చెప్పారు.

వెదురుకుప్పంలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత

చిత్తూరు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వర్షాలు తగ్గడంతో తిరిగి ఎండ వేడిమి పెరగడం ప్రారంభమైంది. శుక్రవారం వెదురుకుప్పంలో అత్యధికంగా 39.8, పుంగనూరులో అత్యల్పంగా 30.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా.. తవణంపల్లెలో 38.2, చిత్తూరు, గుడిపాలలో 37.5, నగరిలో 36.8, పులిచెర్ల, పూతలపట్టులో 36, ఎస్ఆర్‌పురంలో 35.5. బంగారుపాళ్యలో35, చౌడేపల్లె, గంగాధరనెల్లూరు, ఐరాల, నింద్ర, పాలసముద్రం, యాదమరి, పెనుమూరు, విజయపురంలో 34.3, కార్వేటినగరంలో 34.5, సదుంలో 33.7, గుడుపల్లె, శాంతిపురంలో 33.4, రొంపిచెర్లలో 32.9,బైరెడ్డిపల్లె, గంగవరం, రామకుప్పం, సోమల, వీకోటలో 32.4, పెద్దపంజాణిలో32.2 పలమనేరులో 31.4, కుప్పంలో 31.1 డిగ్రీల ఉష్ణోగ్రతలునమోదయ్యాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వి.కోటలో విరబూసిన హరివిల్లు

● కృష్ణమ్మ కొండ మీదుగా కనువిందు చేసిన ఇంద్రధనుస్సు



వి.కోట, మే 23 (ఆంధ్రజ్యోతి): వి.కోట మీదుగా శుక్రవారం సాయంత్రం రంగురంగుల హరివిల్లు విరబూసింది. ఉదయం నుంచి వాతావరణం కాస్త వేడెక్కినా మధ్యాహ్నం నుంచి పలుమార్లు వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. ఆపై సాయంత్రం కాసేపు చిరుజల్లులు కురిశాయి. అదే సమయానికి కృష్ణమ్మ కొండ వైపుగా దివి నుంచి భువికి రంగులు ఆరబోస్తూ ఇంద్రధనుస్సు విరబూసింది. వి.కోట పట్టణం మీదుగా వెలసిన ఈ కనువిందైన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

ముగిసిన శ్రీరామకోటి నామస్మరణ



విశేష అలంకరణలో అభయాంజనేయస్వామి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులు

రామకుప్పం, మే 23(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం ప్రారంభమైన అఖండ శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం ముగిసింది. శ్రీరామకోటి నామస్మరణ ముగింపు సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, దేవతా మూర్తులను దర్శించుకుని, అర్చనలు చేయించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, డప్పుల హోరు మధ్య గ్రామంలో ఊరేగించారు. భక్తులు దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు.

ఆర్టీసీ కార్మికుల హర్షం



కుప్పం డిపో ఎదుట హర్షం వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంయూఏ ఉద్యోగులు రాష్ట్ర స్థాయిలో తలపెట్టిన నిరసనలను అనుసరించి వారికి తగినట్టుగా ఆర్టీసీ ఉద్యోగులపై క్రమశిక్షణ ఉల్లంఘనల విషయంలో తీసుకునే చర్యలుండాలని ఆ సంస్థ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం పట్ల యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. జీవో 1/2019ను అమలు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆర్టీసీ ఎండీ, ఈడీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ కార్యదర్శి ఇజయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, యూనియన్ నాయకులు ఎంసీ.నాయక్, ఎన్ఆర్ రాజా, దిలీప్‌కుమార్, బ్రహ్మం, జయశంకర్, ఎమ్మార్ చంద్ర, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణోత్సవం



ద్రౌపదీ కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సోమల, మే 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట సమీప గార్గేయ నదీ తీరంలోని గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచ పాండవ, ద్రౌపదీ దేవి విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పండితులు హోమాది కార్యక్రమాలు జరిపి కల్యాణోత్సవం జరిపారు. ఆలయం వద్ద రామసముద్రానికి చెందిన భాగవతారణి రత్నకుమారి పగలు హరికథలు, రాత్రి రాయలపేటకు చెందిన కళాకారులచే నాటక ప్రదర్శలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త గుత్తా జయలలితమ్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కౌండిన్య వంతెనపై
రక్షణ స్తంభాలు నిర్మించాలి



పలమనేరు-మండిపేట రహదారిలో కౌండిన్యనదిపై నిర్మించిన వంతెనకు రెండువైపులా లేని రక్షణ స్తంభాలు

పలమనేరు, మే 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని పలమనేరు - మండిపేటకోటూరు రహదారిలో కౌండిన్య నదిపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ స్తంభాలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ప్రతిరోజు మండిపేటకోటూరు, చెత్తపెంట గ్రామాలకు ఆర్టీసీ బస్సును నడుపుతున్నారు. పదుల సంఖ్యలో ఆటోలు ఈ రహదారిపై ప్రతినిత్యం గ్రామీణ ప్రజలను గమ్యాలకు చేరుస్తుంటాయి. ఈ వంతెనపై ఏమాత్రం వాహనాలు అదుపుతప్పినా కౌండిన్య నదిలోకి పడిపోయే ప్రమాదం వుంది. అధికారులు స్పందించి కౌండిన్య నదిపై ఉన్న వంతెనకు రక్షణ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నవధాన్యాల అలంకరణలో
విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పుంగనూరులో పట్టపగలే చోరీ

పుంగనూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే రోడ్డుపై నిలబడిన ఉన్న వ్యక్తిపై దాడిచేసి బంగారు నగలు దోచుకెళ్లిన సంఘటన పుంగనూరులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు... పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన అబ్రార్(27) రోడ్డుపై నిలబడి ఉన్నట్లు గుర్తించిన గుర్తు తెలియని దుండగులు దాడి చేసి మెడలోని బంగారు చైన్, చేతికి ఉన్న ఉంగరాలు లాక్కున్నారు. అతడు కేకలు వేయడంతో చైన్ వదిలేసి దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు పట్టణ శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

చోరీకి గురైన
పంచలోహ విగ్రహం స్వాధీనం

● ఇద్దరి అరెస్టు, పరారీలో ఇద్దరు



స్వాధీనం చేసుకున్న విగ్రహాన్ని చూపుతున్న పోలీసులు

పాలసముద్రం, మే 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పంలో ఇటీవల చోరీకి గురైన పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నగరి డీఎస్పీ అజీజ్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను మీడియాకు తెలిపారు. వెంగళరాజు కుప్పంలోని గంగ మ్మ ఆలయంలో ఉన్న పంచలోహ విగ్రహాన్ని 15 రోజుల కిందట కన్నికాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఆర్.రవి భార్య నాగమ్మ, కుమారులు మురుగేష్ హరీష్, దినేష్, తమిళనాడుకు చెందిన చిరంజీవి అపహరించుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరిలో నాగమ్మ, మురుగేష్ హరీష్‌లు చిత్తూరు- బలిజకండ్రిగ మార్గంలోని వెంగళరాజుపురం క్రాస్ రోడ్డులో పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి విగ్రహాన్ని, ఆంప్లిఫయర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డవారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్ఐ రవి, ఐడీ పార్టీ కానిస్టేబుళ్ల లోకనాథం, గణేష్, రమేష్, కోటిని డీఎస్పీ అభినందించారు.

ఎగువ పాలకూరులో నెమలి



పూతలపట్టు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ పాలకూరు గ్రామంలోకి నెమలి వచ్చిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ సమీపాన ఉన్న అడవులకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో వన్యప్రాణులు ఆహారంకోసం గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఓ నెమలి గ్రామంలోకి రావడంతో వీధికుక్కలు వెంటపడ్డాయి. గ్రామస్తులు గమనించి కుక్కల బారి నుంచి నెమలిని కాపాడి అటవీప్రాంతంలోకి పంపించారు.

మద్దనపల్లెలో లోపించిన పారిశుధ్యం



వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు - మురుగుకాల్వలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి

పుంగనూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగాండ్లపల్లె పంచాయతీ మద్దనపల్లెలో పారిశుధ్యం లోపించి అంటు రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో చిన్న వర్షం కురిస్తే వీధుల్లో ప్రజలు తిరిగే పరిస్థితులు ఉండవని వారు వాపోయారు. మురుగునీరు ప్రవహించే కాల్వల్లోనే తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడ తాగునీరు కలుషితమవుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపునీరు, ఇళ్లలోని వ్యర్థపునీటి వల్ల దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు పెరిగి జ్వరాలు సోకుతున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో ఏర్పాటుచేసిన తాగునీటి కొళాయిలను తొలగించాలని పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి మురుగు కాల్వలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను తొలగించి, వీధుల్లో మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయోత్పత్తులే శరణ్యం

● రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు అధికారి శివకార్తీక్



సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, విప్రో ప్రతినిధులు

రామకుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయోత్పత్తులే శరణ్యమని ఏపీ రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శివకార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన విప్రో సంస్థ సలహాదారు అన్వర్‌బాషాతో కలిసి రామకుప్పం మండలం అంకిరెడ్లపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వెంకటరమణ వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు, జీవామృతం, కషాయాల తయారీ, దిగుబడి, నాణ్యతల గూర్చి ఆయన రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులు నాణ్యమైన, అధిక దిగుబడులు పొందగల్గుతారన్నారు. వచ్చిన దిగుబడులకు మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తుందన్నారు. భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులు తినడం వల్ల ప్రజల ఆరోగ్యం పరిరక్షింపబడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం అవలంబించే రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి రైతు కూడా బిందు, తుంపర్ల సేద్యాన్ని అవలంబిస్తున్నారన్నారు. కొన్నేళ్ళుగా పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రజలు ప్రకృతి వ్యవసాయోత్పత్తుల పట్ల ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రజలు ప్రకృతి వ్యవసాయోత్పత్తుల పట్ల ఆసక్తి చూపుతున్నారని, అధిక ధరలకు సైతం కొనుగోలుకు ముందుకు వస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పం డీఏపీఎం అమృతవల్లి, రామకుప్పం ఎంటీ లక్ష్మీరెడ్డి తదితరులున్నారు.

అధ్వానంగా గుడియాత్తం - మండిపేట రహదారి



పలమనేరు, మే 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మండలంలోని గుడియాత్తం నుంచి కరిడిమడుగు, నలగాంపల్లి, మండిపేట, మండిపేట కోటూరు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వం ఈ రహదారికి పనులు మంజూరు చేసింది. పనులు జరుగుతున్న సమయంలోనే ఎన్నికలు రావడంతో అప్పట్లో నిలిపివేశారు. కొత్తగా బీటీ రోడ్డు వేసేందుకు కంకర పరచి అలాగే వదిలి వేశారు. ఎన్నికలు జరిగిన అనంతరం కాంట్రాక్టరు ఈ పనులను వదిలి వేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇక్కడి పాలకులు గాని, అధికారులు గాని ఈ రోడ్డు దుస్థితి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈరోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు పనిని పూర్తిచేయించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



యోగా యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలో యోగా యాత్రను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఈ యోగా యాత్ర వెళ్తుందన్నారు. యోగా ప్రాముఖ్యాన్ని గురించి తెలియజేసి ప్రజలకు ఆరోగ్య స్పృహ కలుగజేస్తుందని తెలిపారు. పలువురు ప్రముఖులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు గుర్తింపు



కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న మాధవరెడ్డి

పుంగనూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమగానిపల్లె, మోదుగులపల్లె, ఎంసీపల్లె, చంద్రమాకులపల్లె, నేతిగుట్లపల్లె, పాళ్యంపల్లె, సుగాలిమిట్ట, నల్లగుట్లపల్లెతాండా, బోడేవారిపల్లె గ్రామ పంచాయతీల్లో పర్యటించి టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు గుర్తింపుకార్డులను అందజేశారు. గ్రామ పంచాయతీల్లో టీడీపీ నూతన కమిటీలను ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే కార్యకర్తలకు గుర్తింపుతో పాటు పదవులను ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కార్యకర్తలకు బీమా సౌకర్యం, పేదల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత టీడీపీదేనని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణానాయక్, గంగాధర్, మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామకృష్ణానాయక్, రమణ, సోము, రాంబాబు, హరి, మంజునాథ్, మధు, వెంకటరమణ, కోలాట వెంకటరమణ, బాబు నాయక్, రూపేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.2.50 లక్షల విరాళం



దాతకు రసీదు అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మే 23 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి రూ.2,50,000 (అన్నదాన కార్యక్రమానికి రూ.1,25,000, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,25,000)లను విరాళంగా చెన్నైకి చెందిన అనిల్‌కుమార్, అనిత అందించినట్లు శుక్రవారం ఏఈవో రవీంద్రబాబు తెలిపారు. స్వామిని గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు.

కమనీయం ద్రౌపదీదేవి కల్యాణోత్సవం

పెనుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూరుప్పల్లె గ్రామంలో ఉన్న ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి కల్యాణోత్సవాన్ని శుక్రవారం కమనీయంగా నిర్వహించారు. ఉభయదారులుగా గోపాల్‌రెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, రాజేష్, యుగంధర్, అమర్‌నాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైదరాబాదులో
వి.కోట యువకుడిమృతి



రేవంత్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

వి.కోట, మే 23 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం చింతమాకులపల్లెకు చెందిన చంద్రశేఖర రెడ్డి కుమారుడు రేవంత్‌రెడ్డి (28) హైదరాబాదులో మృతి చెందాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న రేవంత్ ఆరు నెలల క్రితం హైదరాబాదుకు బదిలీ అయ్యాడు. అక్కడే పీజీలో సహచరులతో కలసి ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం నిద్రలేచాక కాస్త ఇబ్బందిగా ఉందని పక్క గది వద్దకు వెళ్లి అక్కడే హఠాత్తుగా కుప్పకూలాడు. సహచరులు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం చేసి గుండెపోటుతో యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. యువకుడి మృతితో స్వగ్రామమైన చింతమాకులపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీబీఎస్ఈ గుర్తింపుతో
హాకింగ్స్ స్కూల్ కొనసాగుతుంది: చైర్మన్

కుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బోర్డు గుర్తింపు రద్దు చేసినా సరే, సీబీఎస్ఈ గుర్తింపుతో తమ పాఠశాలలో 8, 9, 10 తరగతులు యథాతథంగా కొనసాగుతాయని కుప్పంలోని హాకింగ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ హఫీజ్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఈవో పెట్టిన అభ్యంతరాలకు తాము వివరణ ఇచ్చామన్నారు. అయినా సరే, 8, 9, 10 తరగతులకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరమన్నారు. హాకింగ్స్ స్కూల్‌లో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకూ ఉన్న గుర్తింపు రద్దు కాలేదన్నారు. స్టేట్‌బోర్డు గుర్తింపుతో ఈ తరగతులు కూడా కొనసాగుతాయని, స్కూల్ మూతపడే ప్రశ్నేలేదని, విద్యార్థుల తల్లిదండ్రులు బాధపడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడు



వెదురుకుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై వేణుగోపాలుడు విహరించాడు. ఉదయం పల్లకీపై మోహినీ అవతారంలో భక్తులకు కనువిందు చేశాడు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. పల్లకీ ఉత్సవం అయ్యాక స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి గరుడ వాహనంపై స్వామివారు విహరించారు. వాహనాలు సేవల ముందు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్తజన బృందాల భజనలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాస్, గోపాలాచారి, శబరీష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగకు చెందిన యువతి (19) గురువారం సాయంత్రం నుంచి కనిపించలేదని తండ్రి వీరవసంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు.

ఇంద్ర వరదుడి బ్రహ్మోత్సవాలకు 27న అంకురార్పణ



విద్యుద్దీపాలతో మిరుమిట్లు గొలుపుతున్న ఆలయం

యాదమరి, మే 23 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల కేంద్రంలో స్వయంభుగా కొలువై వరదరాజులు స్వామిగా పూజలందుకుంటున్న ఇంద్రవరదుడి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 27వ తేదీన అంకురార్పణ జరగనుంది. ఈ సందర్భంగా ఆలయానికి నూతనంగా రంగులు వేసి, విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. 12 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 28న ధ్వజారోహణం, జూన్ ఒకటో తేదీన ఉదయం గరుడోత్సవం, 3న మధ్యాహ్నం రథోత్సవం, 5న తీర్థవారి, పుణ్యకోటి విమానం, ధ్వజావరోహణం, 6న పుష్పపల్లకి, 7న వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

బదిలీల హడావుడిలో ఉద్యోగులు

గంగాధరనెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తప్ప మండలంలో ఇతర ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగుల్లో తప్పనిసరిగా బదిలీలపై వెళ్లే వారు హడావుడిగా కనపడుతున్నారు. ఇప్పటికే కొందరు స్థానిక టీడీపీ నేతల సహకారంతో ఎమ్మెల్యే థామస్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుల ద్వారా సిఫారసు లెటర్లల సేకరించుకోగా, మరికొందరు ఆ లెటర్లు సేకరించేపనిలో నిమగ్నమయ్యారు. బదిలీల జాబితాలో వెటర్నరీశాఖలో ఇద్దరు, ఐసీడీఎస్‌లో నలుగురు, రెవెన్యూలో నలుగురు, గంగాధరనెల్లూరు, తూగుండ్రం వైద్యశాఖలో 16 మంది, విద్యాశాఖలో 57మంది, వ్యవసాయశాఖలో ఒకరు ఉన్నట్లు తెలిసింది.

మహాభారతం ఉత్సవాలకు ఏర్పాట్లు

శ్రీరంగరాజపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురంలో మహాభారత ఉత్సవాలు ఈనెల 30నుంచి వచ్చేనెల 15వ తేదీవరకు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు పర్యవేక్షణలో ప్రారంభించారు. నారాయణస్వామి నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, ఎస్.కుమార్, బాలాజి, బ్రహ్మనాయుడు, కోటి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి టీడీపీలో గుర్తింపు



సమావేశంలో ప్రసంగిస్తున్న చినబాబు

నింద్ర, మే 23 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసేవారికి టీడీపీలో గుర్తింపు ఉంటుందని చిత్తూరు పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి చినబాబు స్పష్టం చేశారు. శుక్రవారం నింద్రలోని సాయిబాబా ఆలయం వద్ద మండల టీడీపీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఉంటేనే పార్టీ అభివృద్ధి చెందుతుందని సూచించారు. మండల అధ్యక్ష పదవి కావాలని పలువురు ఆయన దృష్టికి తేగా, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నాయకులు గంజి మాధవయ్య, గాలి గోపీనాథ్, రమేష్ రాజు, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు చుట్టూ వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): లక్కరాజు మిట్ట వద్ద తాగునీటి బోరు చుట్టూ వ్యర్థాలను తొలగించారు. 'తాగునీటి బోరు చుట్టూ వ్యర్థాలు' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై మాధవరం సర్పంచ్ మమతా శ్రీరాములురెడ్డి, పంచాయతీ కార్యదర్శి డానియల్ స్పందించారు. బోరు చుట్టూ ఉన్న వ్యర్థాలను సిబ్బందితో తొలగించారు. మరోసారి వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని స్థానికులను హెచ్చరించారు.

దేవుని నల్లరాళ్లగుట్టలో క్వారీ నిర్వహించొద్దు



వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

ఐరాల, మే 23 (ఆంధ్రజ్యోతి): నాగమవాండ్లపల్లె పంచాయతీ దేవుని నల్లరాళ్లగుట్టలో క్వారీ నిర్వహించొద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్వారీ వద్దకొచ్చిన వాహనాన్ని శుక్రవారం అడ్డుకున్నారు. ఉదయం లారీపై ఓ హిటాచ్చి యంత్రం తీసుకుని నాగమవాండ్లపల్లె అరుంధతివాడ మీదుగా వెళుతుండగా స్థానికులు గమనించారు. వెంటనే గ్రామస్తులకు విషయం తెలిపారు. అందరూ కలిసి దేవునినల్లరాళ్ల గుట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడున్న వాహనాన్ని అడ్డుకున్నారు. నాగమవాండ్లపల్లె సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేవుని నల్లరాళ్లగుట్ట భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి అనుసంధానమైనదని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో పవిత్రమైనదిగా తాము భావిస్తామని చెప్పారు. అందువల్ల ఇక్కడ ఎలాంటి క్వారీ నిర్వహించవద్దని వాహన డ్రైవర్‌కు చెప్పి.. అక్కడినుంచి పంపించేశారు.

మహాభారతం ఉత్సవాలు ప్రారంభం

గంగాధరనెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నెల్లేపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం వద్ద ధ్వజారోహణం పూజలతో మహాభారతం ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఉభయదారుగా కోటాగరం పంచాయతీ ఎట్టేరికి చెందిన రఘుపతి రెడ్డి వ్యవహరించారు. ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, గంగయ్య మందడి, దేవరాజులునాయుడు, శ్రీధర్‌యాదవ్, ప్రభాకర్‌నాయుడు,యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొవిడ్ నిబంధనలు పాటించాలి

నగరి, మే 23 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. కొవిడ్ లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలని చెప్పారు.

మైనర్లకు బైకులివ్వొద్దు

గుడిపాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు బైకులివ్వొద్దని తల్లిదండ్రులకు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ సూచించారు. ఇలా ఇవ్వడం నేరమని.. చట్టపరంగా తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగకు చెందిన యువతి (19) గురువారం సాయంత్రం నుంచి కనిపించలేదని తండ్రి వీరవసంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడు

వెదురుకుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై వేణుగోపాలుడు విహరించాడు. ఉదయం పల్లకీపై మోహినీ అవతారంలో భక్తులకు కనువిందు చేశాడు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. పల్లకీ ఉత్సవం అయ్యాక స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి గరుడ వాహనంపై స్వామివారు విహరించారు. వాహనాలు సేవల ముందు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్తజన బృందాల భజనలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్ కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాస్, గోపాలాచారి, శబరీష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.





పల్లకీపై మోహినీ అవతారంలో స్వామివారు - ఊంజల్ సేవ - గరుడ వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలస్వామి

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి: ఎమ్మెల్యే జగన్మోహన్



190రామాపురంలో అక్కమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 64 వినతులు, ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మేయర్ అముద, ఎంఈఈ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, గుడిపాల, చిత్తూరు రూరల్ తహసీల్దార్లు జయంతి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ: సీఎం సహాయనిధి బాధితులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో 10మంది బాధితులకు రూ.13,21,244 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో.. చిత్తూరుకు చెందిన పి.విజయ (రూ.2,67,680), పి.షమీమ్ తాజ్ (రూ.30,000), జి.గౌతమ్ కుమార్ (రూ.50,916), పీఆర్ దుర్గ (రూ.42,205), చిత్తూరు రూరల్ మండలానికి చెందిన వి.సంతానమ్మ (రూ.1,73,382), కె.శంకర్ నాయుడు(రూ.1,05,043), ఆర్.నాగరాజు (రూ.1,18,881), ఎ.కృష్ణమూర్తి (రూ.1,49,371), గుడిపాల మండలానికి చెందిన సి.వాసుమూర్తి (రూ.1,80,280), ఎం.సోమశేఖర్ (రూ.2,03,486) ఉన్నారు.

అక్కమ్మతల్లికి సారె సమర్పణ

గుడిపాల: 190రామాపురంలో అక్కమ్మతల్లి తిరునాళ్లను గ్రామస్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సారెను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమర్పించారు. జీజేఎం చారిటబుల్‌ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవుల నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు రవినాయుడు, ప్రభాకర్‌నాయుడు, డిష్ సురేష్, బాలాజి, గోళ్లహరి ప్రసాద్‌చౌదరి, దేవ, పుష్పరాజ్, కార్తీక్, అరుణ, రాజేష్, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ కార్యకర్త సస్పెన్షన్

పూతలపట్టు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించినందుకు టీడీపీ కార్యకర్తను అధిష్ఠానం సూచనతో పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమివారిపల్లెకు చెందిన జయప్రకాష్ ఆకనంబట్టు సర్పంచ్ ఎం.ఎస్.మణిని ఓ కేసు విషయంపై కులం పేరుతో దూషిస్తూ.. చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినందుకు అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, మే 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు రవియాదవ్ పర్యవేక్షించారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



రత్నయ్య (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి): టేకుమంద పంచాయతీ సర్పంచు రత్నయ్య గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబీకులు పలువురు సానుభూతి తెలిపారు.

ద్రౌపదీదేవి కల్యాణోత్సవం



పెనుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూరుప్పల్లె గ్రామంలో ఉన్న ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి కల్యాణోత్సవాన్ని శుక్రవారం కమనీయంగా నిర్వహించారు. ఉభయదారులుగా గోపాల్‌రెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, రాజేష్, యుగంధర్, అమర్‌నాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎగువ పాలకూరులో నెమలి



పూతలపట్టు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ పాలకూరు గ్రామంలోకి నెమలి వచ్చిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ సమీపాన ఉన్న అడవులకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో వన్యప్రాణులు ఆహారంకోసం గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఓ నెమలి గ్రామంలోకి రావడంతో వీధికుక్కలు వెంటపడ్డాయి. గ్రామస్తులు గమనించి కుక్కల బారి నుంచి నెమలిని కాపాడి అటవీ ప్రాంతంలోకి పంపించారు.

గంగ జాతరకు జోరుగా ఏర్పాట్లు



ఐరాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఐరాలలోని గార్గేయినదీ తీరాన ఉన్న పాలేటమ్మ ఆలయంలో గంగమ్మ జాతరకు పనులు జోరుగా సాగుతున్నాయి. గంగమ్మను నిలపడానికి ఆలయం ముందు షెడ్డు నిర్మాణం, గ్రామం పూర్తిగా విద్యుద్దీపాలంకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఈనెల 27, 28 తేదీల్లో జాతర జరుగుతుందని ఆలయ వంశపారపర్య ధర్మకర్త ఎంకే బాలాజి తెలిపారు.

చోరీకి గురైన పంచలోహ విగ్రహం స్వాధీనం

● ఇద్దరి అరెస్టు, పరారీలో ఇద్దరు



స్వాధీనం చేసుకున్న విగ్రహాన్ని చూపుతున్న పోలీసులు

పాలసముద్రం, మే 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పంలో ఇటీవల చోరీకి గురైన పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నగరి డీఎస్పీ అజీజ్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను మీడియాకు తెలిపారు. వెంగళరాజు కుప్పంలోని గంగమ్మ ఆలయంలో ఉన్న పంచలోహ విగ్రహాన్ని 15 రోజుల కిందట కన్నికాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఆర్.రవి భార్య నాగమ్మ, కుమారులు మురుగేష్ హరీష్, దినేష్, తమిళనాడుకు చెందిన చిరంజీవి అపహరించుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరిలో నాగమ్మ, మురుగేష్ హరీష్‌లు చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలోని వెంగళరాజుపురం క్రాస్ రోడ్డులో పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి విగ్రహాన్ని, ఆంప్లిఫయర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డవారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, పాలసముద్రం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్‌ఐ రవి, ఐడీ పార్టీ కానిస్టేబుళ్ల లోకనాథం, గణేష్, రమేష్, కోటిని డీఎస్పీ అభినందించారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఫీల్డ్ సర్వేని పూర్తిచేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా (ఆర్‌ఎస్‌కే) కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఫీల్డ్‌సర్వేని సకాలంలో పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మోతరంగనపల్లెలో వివిధ రకాల పంటలను, మామిడి దిగుబడిని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. టీడీపీ మండల ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, ఆర్‌ఎస్‌కే వ్యవసాయశాఖ అసిస్టెంట్ స్వాతి పాల్గొన్నారు.

బాలికలు బాగా చదువుకోవాలి

గంగాధరనెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): బాలికలు బాగా చదువుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిందుమాలతి, మహిళా పోలీస్ నిర్మల సూచించారు. కిశోరివికాసంలో భాగంగా గంగాధరనెల్లూరు సచివాలయంలో శుక్రవారం బాలికలతోపాటు వారి తల్లులకు విద్యతో కలిగే లాభాలపై అవగాహన సమావేశం జరిగింది. అంగన్వాడీ టీచర్లు వాణి, రజియా, హెల్పర్లు పాల్గొన్నారు.

జిల్లాపై చిన్న చూపెందుకు?: సీపీఐ

చిత్తూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వానికి చిన్న చూపెందుకని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాల విభజన తర్వాత ఇటు తిరుపతి, అటు మదనపల్లె వేరే జిల్లాలకు వెళ్లిపోయాయని చెప్పారు. ఈ విభజనతోనే జిల్లా పూర్తిగా నష్టపోయిందన్నారు. జిల్లా కేంద్రం అన్నివిధాలుగా వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 31 మండలాలతో ఉన్న జిల్లాలో ఇపుడు పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్యకు, నగరిలోని మండలాలను తిరుపతి జిల్లాకు కలపడం సరికాదన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.2.50 లక్షల విరాళం



దాతకు రసీదు అందిస్తున్న ఏఈఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మే 23 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి రూ.2,50,000 (అన్నదాన కార్యక్రమానికి రూ.1,25,000, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,25,000)లను విరాళంగా చెన్నైకి చెందిన అనిల్‌కుమార్, అనిత అందించినట్లు శుక్రవారం ఏఈవో రవీంద్రబాబు తెలిపారు. కాగా, స్వామిని గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



కోర్టు ఆవరణలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

నగరి, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరి జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి.. ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ తెలిపారు. డీఈఈ సుబ్బరాయుడు, ఏఈ వీరభద్రం పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలతో మాట్లాడుతున్న శ్రీదేవి

పెనుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే ప్రతి కుటుంబం ఆర్థికంగా బాగుంటుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పెనుమూరు వెలుగు కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలతో మాట్లాడారు. అనంతరం మహిళా మార్టును సందర్శించారు. మధ్యాహ్నం గొడుగుమానుపల్లెలో చేనేత కార్మికులు తయారు చేస్తున్న దుస్తులను పరిశీలించారు. కార్మికులు గ్రూపుగా కలిసి వస్తే దుస్తులకు గిట్టుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎం చిరంజీవి, ట్రైనర్‌లు ఇందు, వాణి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపడంలో జాప్యమెందుకు?: సీపీఐ



కేవీపురంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

విజయపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): తమకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపడంలో రెవెన్యూ అధికారులు జాప్యమెందుకు చేస్తున్నారని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం కేవీపురం సచివాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. మూడేళ్ల కిందట సర్వే నెంబరు 183లో 78 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి స్థలాలు చూపకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. నగరి ఎమ్మెల్యే స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, నాయకులు ఏసుపాదం, మహేంద్ర, సుబ్రహ్మణ్యం, రవి, పూర్ణిమ, అముద, మల్లీశ్వరి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం ఎంపీడీవోగా మహేష్

బంగారుపాళ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ఎంపీడీవోగా మహేష్ శుక్రవారం బాధ్యతలు చేట్టారు. ఈయన బైరెడ్డిపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జీ ఎంపీడీవోగా ఉన్న శ్రీధర్ ఇకపై ఏవోగా కొనసాగనున్నారు.

లిక్కర్ కేసులో జగన్ జైలుకెళ్లడం ఖాయం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో మాజీ సీఎం జగన్ జైలుకెళ్లడం ఖాయమని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రజల సానుభూతిని పొందాలని ఇష్టమొచ్చినట్లు గావుకేకలు పెట్టారని విమర్శించారు. సీఎం చంద్రబాబును విమర్శించడం జగన్ అహంకారానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే నోటికొచ్చినట్లు మాట్లాడితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. లిక్కర్ సిండికేట్‌లోని ముఠా సభ్యులంతా ఇప్పుడు జైలులో చిప్పకూడు తింటున్నారని అన్నారు. అయినా వారంతా మంచి వారని జగన్ అనడం చూస్తుంటే ఒక దొంగ ఇంకో దొంగకు సర్టిఫికెట్ ఇచ్చినట్లుందని వ్యంగ్యంగా విమర్శించారు... వండి పడ్డారు. తాను విజయవాడలోనే ఉన్నానని ఎప్పుడైనా అరెస్టు చేసుకోవచ్చని జగన్.. బీరాలు పలుకుతున్నారన్నారు. ఈ సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, మేషాక్, ధరణి ప్రకాష్, కరుణాకరన్, గోవిందరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.